క్లుప్తంగా

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

చీమకుర్తి: క్షయ వ్యాధి, దాని నివారణపై సంబంధిత డాక్టర్లు బుధవారం స్థానికులకు అవగాహన కల్పించారు. చీమకుర్తి పరిధిలోని గంగా స్టోన్ గ్రానైట్ ఫ్యాక్టరీ సమీపంలో డాక్టర్ శ్రీవాణి, చీమకుర్తి అర్బన్ డాక్టర్ బేబీ, టీబీ సూపర్‌వైజర్ బాల పరశురాం పాల్గొని క్షయ వ్యాధి వ్యాపించే విధానం, దానిని నివారించే పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోగినేని వెంకటేశ్వర్లు, చలువాది బదరీనారాయణ, కాట్రగడ్డ రమణయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

6న రాకెట్ బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక

ఒంగోలు: రాష్ట్ర స్థాయి రాకెట్ బాల్ అండర్ 19 బాల బాలికల జట్ల ఎంపిక ఈనెల 6న స్థానిక హైదరాబాద్ స్కూలు ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.అన్వర్‌బాషా, షేక్ షాహీదాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన బాలబాలికల జట్లు త్వరలో పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల బాలబాలికలు ఈనెల 6న ఉదయం 10 గంటలకు తమ ఆధార్‌కార్డుతో ఎంపిక ప్రదేశానికి చేరుకుని రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9133490213ని సంప్రదించాలని సూచించారు.

పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలంలోని మంగమూరు, ఎనికపాడు, ఏలూరివారిపాలెం గ్రామాలకు ఆయా గ్రామస్తుల కోరిక మేరకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా ఆర్‌ఎం జీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఒంగోలు నుంచి మంగమూరు, సంతనూతలపాడు మీదుగా గుడిపాడు, కొనగా నివారిపాలెం, ఏలూరువారిపాలెం గ్రామాలకు రోజుకు మూడు ట్రిప్పులు తిరుగుతాయన్నారు. అదేవిధంగా ఒంగోలు నుంచి మంగమూరు మీదుగా సంతనూతలపాడు, చంద్రపాలెం, గంగవరం, గుమ్మలంపాడు, ఎనికపాడు గ్రామాలకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు ట్రిపులు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం కోరారు.

రామనామం మోక్షదాయకం



రామాయణం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులు, గోపి, తదితరులు

ఒంగోలు మెట్రో: రామాయణం మతగ్రంథం కాదని, మానవతా గ్రంథమని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. స్థానిక సంతపేట రాఘవేంద్రస్వామి బృందావనంలో బుధవారం నిర్వహించిన సభలో కవి బంతికట్ల నాగేశ్వరరెడ్డి రచించిన వినాయక సంకల్ప రామాయణం గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రామనామం మోక్షదాయకమని, సర్వపాప హరణమని అన్నారు. తండ్రి, కుమారులు, భార్య భర్త, అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీక అని, కుటుంబ వ్యవస్థకు దర్పణమని అన్నారు. వాల్మీకి అనంతరం ఎంతోమంది సుప్రసిద్ధమైన కవులు రామాయణాన్ని వారి అక్షరాలతో రచించటం నేటికీ జరుగుతోందన్నారు. రాముడి మీద భక్తితో నాగేశ్వరరెడ్డి రామయణాన్ని రచించి తన జీవితాన్ని సార్థకత చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్రస్వామి మందిర వ్యవస్థాపకుడు చింతపల్లి గోపి, రచయిత బంతికట్ల నాగేశ్వరరెడ్డి, సాహితీ విమర్శకులు యు.వి.రత్నం, ఓరుగంటి ప్రసాద్, సినీ విశ్లేషకుడు జానకిరామ్, పాటల రచయిత మధురశ్రీ, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లు, ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపరచాలి



వైద్యులు, వసతి గృహ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ

నాగులుప్పలపాడు: వసతి గృహల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యా అవకాశాల్లో జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వసతి గృహ సలహా సంఘ సమావేశంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధిపై ఎంపీపీ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో అభివృద్ధి ప్రణాళికలపై వైద్యులతో సమీక్షించారు. సమావేశంలో వసతి గృహ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు

మొక్కలు నాటితేనే ప్రాణవాయువు

- ఏకేయూ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు



మొక్కలు నాటుతున్న వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ నిర్మలామణి

ఒంగోలు సిటీ: పైసా ఖర్చు లేకుండా ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా, ఉచితంగా, విరివిగా ప్రాణ వాయువు పొందాలంటే అవకాశం ఉన్న ప్రతిచోటా అధిక సంఖ్యలో మొక్కలు నాటాల్సిందేనని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు అన్నారు. «స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర» కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో బుధవారం వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వాముడై పల్లెలు, పట్టణాలు, నగరాలు అనే తారతమ్యం లేకుండా విరివిగా మొక్కలు నాటి పెంచాలని కోరారు. ఏకేయూలో అపరిశుభ్ర వాతావరణాన్ని తొలగించడం, పరిశుభ్రత - పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత కల్పించడం, యూనివర్సిటీ ప్రాంగణాన్ని అత్యంత సుందరంగా, ఆహ్లాదకరంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. మొక్కలను అధికంగా పెంచడం వల్ల స్వచ్ఛమైన గాలి అందిస్తాయని, అంతేగాకుండా యూనివర్సిటీ పరిసరాలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని విద్యార్థులకు అందిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాలలో అపరిశుభ్ర వాతావరణాన్ని తొలగించడం కోసం కృషి చేయాలని, మొక్కలు నాటడం ద్వారా హరితవనాలను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతందేవ్ కుమార్, డాక్టర్ సీహెచ్ నరేంద్ర, ఎస్.బాలకృష్ణ, ప్రిన్సిపాల్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ సెంటర్లకు జాతీయ స్థాయి గుర్తింపు

- డీఎంఅండ్‌హెచ్‌వో చేతుల మీదుగా సర్టిఫికెట్ల పంపిణీ





డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకుంటున్న ఎంఎల్‌హెచ్‌పీలు భారతి, జాన్సీ, త్రినాథ్

కొత్తపట్నం: మండలంలోని హెల్త్ క్లినిక్ సెంటర్లకు ఢిల్లీ బృందం నిర్వహించిన పరిశీలనలో జాతీయ స్థాయి గుర్తింపు సర్టిఫికెట్లు లభించాయి. బుధవారం ఒంగోలులోని కలెక్టరేట్లో డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎన్‌కాస్ బృందం సెప్టెంబర్-2023లో కొత్తపట్నం పీహెచ్‌సీ పరిధిలోని అల్లూరు-1 హెల్త్ క్లినిక్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీ (సీహెచ్‌వో)గా విధులు నిర్వహిస్తున్న బత్తుల భారతి, అల్లూరు-2 హెల్త్ క్లినిక్ సెంటర్‌లో పనిచేస్తున్న త్రినాథ్, రంగాయపాలెం హెల్త్ క్లినిక్ సెంటర్‌లో పనిచేస్తున్న జాన్సీ రాసిన 500 పేజీలతో కూడిన 100 రికార్డులను మూడు రోజుల పాటు పరిశీలించింది. టీపీ శాతం, ఎన్‌సీపీ, ఏఎంసీ, పీఎంసీ, క్యాన్సర్, వంటివాటికి మెరుగైన వైద్యం అందించిన రికార్డులు, తదితర రికార్డులు పరిశీలించారు. హెల్త్ క్లినిక్ సెంటర్‌లలో 105 రకాల మందులు, ఏడు సర్వీసుల ద్వారా 80 రకాల సేవలు అందించడాన్ని గుర్తించారు. గ్రామాల్లోకెళ్లి హెల్త్ క్లినిక్ సెంటర్ల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. మెరుగైన సేవలు అందుతున్నాయని గ్రామాల ప్రజలు ఎన్‌కాస్ బృందానికి తెలిపారు. పారిశుధ్యం కూడా బాగుందని గుర్తించారు. దీంతో మూడు హెల్త్ క్లినిక్ సెంటర్లకు 100కి 89 మార్కులిచ్చారు. జాతీయ స్థాయిలో గుర్తింపు సర్టిఫికెట్లు రాగా, బుధవారం కలెక్టర్ కార్యాలయంలో బత్తుల భారతి, జాన్సీ, త్రినాథ్‌లకు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన వైద్యం అందించడం గొప్ప విషయమని వారిని అభినందించారు. కార్యక్రమంలో డీపీవో వాణిశ్రీ, డిస్ట్రిక్ క్వాలిటీ మేనేజర్ కృష్ణప్రసాద్, కన్సల్టెంట్ మురళీకృష్ణ, ఎన్‌సీపీ కో ఆర్డినేటర్ భగీరథ, కొత్తపట్నం పీహెచ్‌సీ డాక్టర్ బి.శ్రావ్య, డాక్టర్ మహేష్, యూడీసీ చైతన్య పాల్గొన్నారు.

పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలి



చీమకుర్తిలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



సంతనూతలపాడులో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

చీమకుర్తి రూరల్: ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని, అప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ ఇవాంజలిన్ తెలిపారు. బుధవారం చీమకుర్తి మండలంలోని మువ్వావారిపాలెం, బూదవాడ, పల్లామల్లి గ్రామాల్లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు శైలజ, నాగలక్ష్మి, దేవసేన, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని పలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. సంతనూతలపాడు, మంగమూరు, కామేపల్లి గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని పిల్లలకు సమపాళ్లలో అందించడం వలన వారి ఎదుగుదల బాగుంటుందని అన్నారు. అందువలన ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



గమళ్లపాలెంలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సువార్త

కొత్తపట్నం: మండలంలోని గమళ్లపాలెం పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆధార్ నమోదు నూతన కేంద్రాన్ని ఒంగోలు డివిజన్ డెవలప్మెంట్ ఆఫీసర్ సీహెచ్ సువార్త ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికులు ఆధార్ నమోదు కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇక్కడ అనేక సేవలు పొందవచ్చన్నారు. ఆధార్ కార్డు లేని వారు, అడ్రస్‌లు మార్చుకునే వారు, పేర్లలో తప్పులు, వివిధ రకాల మార్పులు చేసుకోవచ్చన్నారు. మీ దగ్గర ఉన్న ఆధారాలు సమర్పించి ఆధార్ కార్డులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.శేషుబాబు, డిప్యూటీ ఎంపీడీవో వేణుమూర్తి, సర్పంచ్ భర్త వెంకటనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు బలగాని వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



బదరీనారాయణను సత్కరిస్తున్న ఎంఈఓలు, డాక్టర్ జవహర్

చీమకుర్తి: స్థానిక మండల పరిషత్ ఉర్దూ పాఠశాల అభివృద్ధికి గెలాక్సీ గ్రానైట్ యజమాని చలువాది బదరీనారాయణ అందించిన సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్, ఎంఈఓ-1, 2 నరసింహారావు, శివాజీ అన్నారు. పాఠశాల అభివృద్ధికి బదరీనారాయణ సేవలందించిన సందర్భంగా పాఠశాల హెచ్ఎం వద్ది మోహన్ అతిథులతో కలిసి బుధవారం ఘనంగా సత్కరించారు. రూ.5 లక్షల వ్యయంతో పాఠశాల ఆవరణలో స్టేజీ నిర్మాణం, విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి డైనింగ్ హాలు, బాత్ రూములు, ఇతర నిర్మాణాలు చేపట్టడం గొప్ప విషయమని బదరీనారాయణ సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు చలువాది పార్థసారధి, ప్రభుత్వ హైస్కూలు హెచ్ఎం ఎన్‌వీఎస్ఎస్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గణపతి హోమాలు



గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక సీతారాంపురంలోని వినాయకుని దేవస్థానంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణపతి ఆశీస్సులు అందుకున్నారు.

సోక్‌పిట్‌లు నిర్మించుకోవాలి



మద్దిపాడు పైపాలెం వద్ద సోక్‌పిట్ అవశ్యకతను మహిళలకు వివరిస్తున్న ఈసీ కిషోర్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు

మద్దిపాడు: మురుగునీటి పారుదల లేని గ్రామాల్లో సోక్‌పిట్‌లు ఏర్పాటు చేసుకుని రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండకుండా, దోమలు పెరగకుండా నివారించుకోవచ్చని ఎంపీడీఓ వి.జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని 20 పంచాయతీల పరిధిలో మోడల్ సోక్‌పిట్ నిర్మాణాలను ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులతో చేపట్టారు. సోక్‌పిట్‌ల నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారుకు రూ.6 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు మూడడుగుల లోతులో గుంత ఏర్పాటు చేసుకుని అందులో రాళ్లు సైజుల వారీగా నింపుకోవాలని ఈసీ కిషోర్‌కుమార్ సూచించారు. ఇటువంటి నిర్మాణాల వలన భూగర్భ జల వనరులు కూడా పెరుగుతాయన్నారు. మురుగునీరు బయటకు పోవడానికి అవకాశం లేని ప్రతి ఒక్క గృహిణి సోక్‌పిట్‌లు ఏర్పాటు చేసుకుని సమస్య పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో ఈ సేవా కేంద్రం



ఈ సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఈసేవా కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ సేవా సెంటర్‌లోని కంప్యూటర్లలోని వివరాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కక్షిదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి టి.రాజా వెంకటాద్రి మీడియాతో మాట్లాడుతూ కక్షిదారులు తమ కేసుల వివరాలను, సులభంగా తెలుసుకునేందుకు ఈ సేవ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కక్షిదారులు తమ కేసుల వివరాలతోపాటు కోర్టులకు సంబంధించిన సమాచారాన్ని కూడా సులభంగా పొందేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. కక్షిదారులు ఈ సేవ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 8వ అదనపు జిల్లా జడ్జి జి.దీన, పోక్సో కోర్టు జిల్లా న్యాయమూర్తి కె.శైలజ, 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.పూర్ణిమ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.హేమలత, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వి రామకృష్ణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, ఒంగోలు బార్ అసోసియేషన్ పాలకవర్గ ప్రతినిధులు, న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

మాతృమరణాలు నివారించాలి

ఒంగోలు టౌన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం వైద్య సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా క్వాలిటీ అస్యూరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు ప్రసవానికి ముందు, తరువాత నాణ్యమైన సేవలను అందించడం ద్వారా మాతృ మరణాలు నివారించాలని చెప్పారు. ముస్కాన్ కార్యక్రమంలో ప్రకారం నవజాత శిశువుల వ్యాధులను సకాలంలో నయం చేయడమే కాకుండా మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారితో సమన్వయం చేసుకొని క్వాలిటీ అసురెన్స్ కమిటీ నిబంధనలను అమలు చేయాలన్నారు. ఓపీ, లేబర్ రూం, చిన్నపిల్లలు, గర్భిణుల వార్డుల్లో ఇచ్చే ఇచ్చే విభాగానికి చెందిన సిబ్బంది క్వాలిటీ అసురెన్స్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అనంతరం 27 మంది వైద్యాధికారులకు, ఎంఎల్‌హెచ్‌పీలకు క్వాలిటీ అస్యూరెన్స్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ శ్రీనివాస నాయక్, కో ఆర్డినేటర్ డాక్టర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న చెన్నకేశవస్వామి ఆలయం మూసివేత

మార్కాపురం టౌన్: చంద్ర గ్రహణం సందర్భంగా ఈనెల 7వ తేదీన మార్కాపురం పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి దర్శనాలను నిలిపివేస్తామని, సోమవారం ఉదయం 6 గంటలకు ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని బుధవారం ఓ ప్రకటనలో వివరించారు.



కమలా వెస్లీకి నివాళులర్పిస్తున్న చుండూరి రవిబాబు, కఠారి శంకర్, ఇతర నాయకులు

వెస్లీ మాతృమూర్తికి చుండూరి నివాళులు

ఒంగోలు టౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన అద్దంకి జాన్ కేరీ వెస్లీ మాతృమూర్తి కమలా వెస్లీ (94) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మరణించారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, నాయకులు, కార్యకర్తలు బుధవారం స్థానిక మిరియాలపాలెంలోని వెస్లీ స్వగృహంలో కమలా వెస్లీ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ వెస్లీ కుటుంబానికి దివంగత మహానేత రాజశేఖరరెడ్డితో మంచి అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. తనకు కూడా వెస్లీ కుటుంబంతో సాన్నిహిత్యం ఉందన్నారు. ఉన్నత విద్యావంతులైన వెస్లీ నిబద్ధత కలిగిన అధికారిగా పేరొందారని చెప్పారు. విద్యారంగంలో పనిచేసిన జాన్ వెస్లీ, కమలా వెస్లీ దంపతులు తమ బిడ్డలందరినీ గొప్పగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, కో ఆప్షన్ సభ్యుడు శ్యాంసాగర్, 13వ డివిజన్ అధ్యక్షుడు సూర్య రాజేష్, 8వ డివిజన్ అధ్యక్షుడు తేళ్ల చర్చిల్ గిఫ్ట్, 46వ డివిజన్ అధ్యక్షుడు పాకల శ్రీను, క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకుడు ఐజాక్, ఇతర నాయకులు అమిత్, రాజశేఖర్, అవినాష్, రాకేష్, పులుసు సురేష్, దేవా, శ్రీకాంత్, పీటర్, కార్తీక్, నాని, చిక్కి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి చేరుకున్న ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర



చీమకుర్తిలో కొనసాగుతున్న ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

చీమకుర్తి: విద్యా పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర బుధవారం పొదిలి మండలం ఉప్పలపాడు నుంచి చీమకుర్తి చేరుకుంది. చీమకుర్తిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌తో పాటు బీసీ, గిరిజన, ఎస్సీ బాలికల హాస్టళ్లను వారు సందర్శించారు. హాస్టళ్లలోని విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎస్ఎఫ్ఐ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ వద్దకు వచ్చి విద్యార్థుల సమస్యలడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం పథకం డబ్బులు ఇంకా కొంతమందికి రాలేదని వారి దృష్టికి రావడంతో.. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సీహెచ్ వినోద్, జీ దేవరాజు, శ్రీకాంత్, కొండారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీయించాలి



మద్దిపాడులో గృహిణులతో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ

మద్దిపాడు: మురుగు కాలువల్లో పూడికలు తీయించి మురుగు నిల్వ ఉండకుండా చూడాలని డీపీఓ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం మద్దిపాడు మండల కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తున్నారా, తడిచెత్త, పొడి చెత్తగా వేరు చేసి సేకరిస్తున్నారా.. లేదా..? ఆరా తీశారు. అనంతరం గృహిణులతో మాట్లాడుతూ ప్రతి రోజు చెత్త సేకరణకు రిక్షా వస్తుందా.. లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెత్తను వేరు చేసే విధానాన్ని సిబ్బందికి వివరించారు. పండ్లు, కూరగాయలు, కుళ్లిపోయే వస్తువులను తడిచెత్తగా సేకరించాలని, అట్టలు, బాటిల్స్, ప్లాస్టిక్, పేపర్లు వంటివాటిని పొడిచెత్తగా వేరు చేయాలని, ప్రమాదకరమైన సూదులు, పురుగు మందులు, గడువు ముగిసిన మందులు వంటివాటిని వేరుగా సేకరించి వాటిని గ్రీన్ అంబాసిడర్‌కు అందిస్తే వారు తీసుకెళ్లి గుంత తీసి ప్రమాదకరమైన చెత్తను పూడ్చివేస్తారని వివరించారు. ఆయన వెంట ఎంపీడీఓ వి.జ్యోతి, ఈఓపీఆర్‌డీ రఘుబాబు, ఇన్‌చార్జి కార్యదర్శి ఆశాలక్ష్మి, పలువురు మహిళలు పాల్గొన్నారు.